క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన ఎడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీహార్స్ ప్రతిమలు ఏర్పాటు చేయండి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ : పోర్టు ముఖద్వారం వద్ద సీహార్స్ ప్రతిమలు ఏర్పాటు చేయాలని కోరుతూ జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పోర్టు, జీవీఎంసీ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. శుక్రవారం పోర్టు ముఖద్వారం గణపతి, తేజస్వినిలతో కలిసి స్థలపరిశీలన చేశారు. 2019లో కురిసిన వర్షాల కారణంగా సీహార్స్ ప్రతిమలు కూలిపోయాయని, అప్పటి నుంచి పోర్టు ముఖద్వారం బోసిపోయిందన్నారు. మళ్లీ వాటిని ఏర్పాటు చేసి మునుపటి కళ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘోషా ఆసుపత్రి వద్ద రూ.10కే భోజనం



భోజనం అందిస్తున్న రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు

జగదాంబ : ఘోషా ఆసుపత్రి వద్ద స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ, రౌండ్ టేబుల్ సంస్థలు సంయుక్తంగా రూ.10కే భోజనం అందిస్తున్నాయి. దూర ప్రాంతాల నుండి ఆసుపత్రికి వచ్చే వారికి సేవ చేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ తెలిపారు. అంతే కాకుండా ఎండలు ఎక్కువ ఉన్న కారణంగా భోజనంతో పాటు ఆ పది రూపాయలకే పోషక విలువలు కలిగిన రాగి జావా కూడా అందిస్తున్నామన్నారు. దీనిపై ప్రజలు, పేషెంట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు డి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

సంక్షేమంగా.. బతుకు పయనం

గతంలో ప్రభుత్వాలంటే అదేదో బ్రహ్మపదార్థం అన్నట్లు.. మన కంటికి కనిపించని దూరాల్లో ఉండే జడపదార్థం అన్నట్లు పరిస్థితులు ఉండేవి. సామాన్యుడు ఏనాడూ వాటి గురించి ఆలోచించే వాడు కాదు. తన బతుకేదో తాను బతికేవాడు. కష్టమొచ్చినా, బాధ కలిగినా అదంతా అతని సొంత వ్యవహారం లాగే ఉండేది. తనకి, ప్రభుత్వానికి ఎలాంటి అవినాభావ సంబంధం లేకపోవడం వల్ల అతన్ని ఆదుకునేందుకు నాటి ప్రభుత్వాలు చొరవ చూపేవి కాదు. కేవలం ఎన్నికలప్పుడే అప్పటి ప్రభుత్వాలకు ప్రజలు జనంలా కాకుండా మనుషుల్లా కనిపించేవారు. కాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రతిక్షణమూ తపిస్తూ పేదవాడి గుండె చప్పుడుగా పాలనలో ముందుకు సాగుతోంది. అందుకే ప్రతి పేదింట ప్రభుత్వ సంతకం ఉపాధిగాను, భరోసాగాను, ఆసరాగాను, చేయూతగాను.. ఇలా ఎన్నో విధాల తన వాణిని, బాణిని వినిపిస్తోంది.



జగనన్న తోడు పథకం ద్వారా వచ్చిన నగదుతో వ్యాపారం చేసుకుంటున్న మహిళ

- ప్రతి పేదింట వెలుగులు నింపుతున్న ప్రభుత్వ పథకాలు
- సంక్షేమ పథకాలను జీవనోపాధిగా మలుచుకుంటున్న మహిళలు
- ఆర్థిక స్వావలంబనతో కుటుంబాలకు ఆసరా



'ఆసరా'తో కూరగాయల వ్యాపారం..

జగదాంబ: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు జీవనోపాధిగా మారుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి నాటి పాదయాత్రలో ఇచ్చిన హామీలు కాకుండా ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. మహిళా సాధికారతకు ఆసరా, జగనన్న తోడు వంటి పథకాలు అమలు చేస్తున్నారు. ఈ పథకాల ఆసరాతో ఎంతో మంది మహిళలు ఇంటి వద్దే చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. జీవీఎంసీ 35వ వార్డు సచివాలయం పరిధిలో వందలాది మంది ఆసరా పథకం అండతో తమ కాళ్లపై తాము నిలబడ్డారు.

గత ప్రభుత్వంలో ఎలాంటి అండా దొరకలేదు..

గత ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు అది చేస్తాం.. ఇది చేస్తామంటూ జనాలను ఊదరగొట్టడమే కానీ.. అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదు. ఏదో మొక్కుబడిగా ఇచ్చే అరకొర పింఛన్లు కూడా ఎప్పుడిస్తారో.. ఎలా ఇస్తారో కూడా తెలిసేది కాదు. ముసలీ ముతకా ఆ పింఛన్ డబ్బుల కోసం ఎండనకా.. వాననకా కార్యాలయాల చుట్టూ.. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయేవారు. ఈ కారణంగా ఎంతో మంది మహిళలు చిన్నచిన్న పిల్లల్ని తీసుకుని కూలి పనులకు వెళ్లేవారు. ఈ నేపథ్యంలో జగనన్న ప్రభుత్వం ప్రతి పేదవాడి బతుకులో వెలుగులు నింపింది. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి.. కొత్త పథకాలు సృష్టించి ప్రజలకు అందిస్తున్నారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల వారు సంతోషంగా బతుకుతున్నారు.

గతంలో ఇంటాయన తేవాలి.. కుటుంబమంతా తినాలి..



గతంలో ఇంటాయన ఒక్కడు తెస్తే కుటుంబమంతా తినాల్సి వచ్చేది. ఆడవాళ్లకంటూ ఎలాంటి ఆసరా దొరికేది కాదు. దాంతో మేం ఏ పని చేయలేకపోయేవాళ్లం. ఇప్పుడు జగనన్న తోడు పథకం ద్వారా అందిన డబ్బుతో బ్యాంబూ (వెదురు) ఉపకరణాల వ్యాపారం చేస్తూ ఇంటి అవసరాలకు అంతో ఇంతో సంపాదిస్తూ ఇంటాయనకు చేదోడు వాదోడుగా ఉంటున్నాను. జగనన్న అందిస్తున్న పథకాలు నాలాంటి వారు బతకడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

రాజేశ్వరి, బ్యాంబూ వ్యాపారి, పూర్ణామార్కెట్.

జగనన్న ఆసరా ఆదుకుంది..



ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మమ్మల్ని జగనన్న ఆసరా ఆదుకుంది. వడ్డీలకు డబ్బులు తీసుకుని వ్యాపారం చేసుకునే రోజులు పోయాయి. ప్రభుత్వం ఇస్తున్న జగనన్న తోడు ఆదుకుంటుంది. ఆ పథకం ద్వారా వచ్చిన డబ్బులతో మా ఆవిడ, నేను కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నాం. ఇప్పుడు బతుకు సాఫీగానే సాగిపోతోంది. సీఎం పాలన బాగుంది.. పేదలను ఆయన ఆదుకునే తీరు కూడా బాగుంది.

కృష్ణారెడ్డి, కూరగాయల వ్యాపారి, పూర్ణామార్కెట్.

ప్రతి పథకం ప్రజలకు అందేలా...



ప్రభుత్వం ఇస్తున్న ప్రతి పథకం అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నాం. ఇప్పటికీ అర్హులై ఉండి కూడా ఎవరికైనా ఏ పథకం అయినా అందకపోతే వెంటనే తెలియపరిస్తే వారి ఇంటికి సెక్రటరీ వచ్చి పథకం అందే విధంగా చర్యలు తీసుకుంటారు.

విల్లూరి భాస్కరరావు, కార్పొరేటర్, 35వ వార్డు.

41వ ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా 41వ ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు తెలిపారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవలో భాగంగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా నగరంలోని ఆర్యవైశ్యులు అందించిన విరాళాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒకసారి ఒక పెళ్లి సంబంధం చూడడానికి సమయం, ధనం ఎక్కువగా ఖర్చవుతుందని, కానీ ప్రస్తుత జీవన విధానంలో ఈ విధమైన వధూవరుల పరిచయ సభల వల్ల ఒకేసారి ఎక్కువ మంది నుంచి తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే అవకాశం ఉన్న ఇటువంటి కార్యక్రమాన్ని ఆధునిక స్వయంవరాలుగా అభివర్ణించవచ్చని పేర్కొన్నారు. ఈ పరిచయ కార్యక్రమం ఆర్యవైశ్యులకు మాత్రమేనని, పరిచయ వేదికలో పాల్గొనే వారు వచ్చే నెల 27లోగా నగదు/ఫోన్‌పే/మనియార్డర్ ద్వారా సంఘ కార్యాలయంలో సంప్రదించి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7780149250 నంబరులో సంప్రదించవచ్చు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పూసర్ల సురేష్‌కుమార్, పరిచయ వేదిక ఉప సంఘం చైర్మన్ దుర్గా సోమేశ్వరరావు, పాలూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవికి సత్కారం



డాక్టర్ రవిని సత్కరిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

మహారాణిపేట : ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్న ఆంధ్రా మెడికల్ కాలేజీ దేశ, విదేశాల్లో స్థిర పడ్డ పూర్వ విద్యార్థులను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ రవి సిరిపురపు (1991), డాక్టర్ సురేష్ కంకణాల (1992) సెంటినరీ అల్యూమినా బ్లాక్ కోసం సహకరిస్తున్నారు. శుక్రవారం డాక్టర్ రవి సిరిపురపు ఆంధ్రా మెడికల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి సిరిపురపును ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజుతో పాటు ఇతర సీఏబీ సభ్యులు డాక్టర్ ఇ.పెదవీర్రాజు, డాక్టర్ పి.వి. సుధాకర్, డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు, డాక్టర్ అపరంజి, డాక్టర్ ఎస్.ఎన్.ఆర్.నవీన్ తదితరులు సత్కరించారు.

సోషల్ మీడియాలో ప్రతిభ చూపిన కార్యకర్తలకు సత్కారం

అల్లిపురం: టీమ్ జగనన్న యాప్ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న టాప్–5 కార్యకర్తలను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఘనంగా సత్కరించారు. శుక్రవారం జరిగిన ప్రజాదర్బారులో ఆయన పాల్గొని 36వ వార్డుకు చెందిన మట్టా జీవన్ 5840 టాస్క్స్ షేర్ చేసి 192670 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచాడు. రెండవ స్థానంలో ప్రణేష్ 1329 షేర్స్‌తో 175331 పాయింట్లతో రెండవ స్థానంలోను, 31వ వార్డు గొల్లలపాలేనికి చెందిన మైలపిల్లి అరుణ్‌కుమార్ 3561 టాస్క్స్ షేర్ చేసి 117345 పాయింట్లతో మూడవ స్థానం, 27వ వార్డు దొండపర్తిలో నివసిస్తున్న నాగిరెడ్డి శ్రావణి 1569 టాస్క్స్ షేర్ చేసి 72230 పాయింట్లతో నాల్గవ స్థానం, 41వ వార్డు జ్ఞానాపురంలో నివసించే మామిడి మోహన్ 1815 టాస్క్‌షేర్ చేసి 67115 పాయింట్లతో ఐదవ స్థానంలో నిలిచారు. వీరిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నీ 98.3 శాతం ప్రజలకు అందించటంలో దేశంలోనే డైనమిక్ సీఎంగా పేరు గాంచారన్నారు. ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే టీమ్ జగనన్న యాప్ ద్వారా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నవారిని సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, బిపిన్ కుమార్ జైన్, మాసిపోగు రాజు, కోడిగుడ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సత్కారం పొందిన కార్యకర్తలతో ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

రూ.50 లక్షలతో వ్యాయామశాల నిర్మాణం



జిమ్‌కు శ్లాబ్ వేయిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ తదితరులు

జగదాంబ : వ్యాయామంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. శుక్రవారం పెద్దవీధిలో రూ. 50 లక్షల వ్యయంతో వ్యాయామశాల (జిమ్) నిర్మాణం ప్రారంభించారు. గతంలో ఉండే బాబులాల్ జిమ్ కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకోవడంతో కార్పొరేటర్ జీవీఎంసీ నిధులతో పునర్నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. దీంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముస్లింలను ఓటు బ్యాంక్‌గా చూస్తే జగనన్న ప్రభుత్వం వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్తుందన్నారు. అనంతరం శ్లాబ్ నిర్మాణానికి ముందు మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 34వ వార్డు అచ్చియ్యమ్మపేటలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, ఆదివిష్ణు, జేసీఎస్ కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, వాసుపల్లి నారాయణ, దూడ అప్పారావు, బోణి దేవ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

36వ వార్డులో..

ఏవీఎన్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి తక్షణమే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, బోణి దేవ, కోరాడ రమేష్, అడపా శివ తదితరులు పాల్గొన్నారు.



అచ్చియ్యమ్మపేట ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనలక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గాదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాల కమిటీ సభ్యులు, సేవా దళం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అలంకరణలో దుర్గమాంబ

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయంత్రం లలితానగర్ లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు అఘోర మృత్యుంజయ పాశుపత అభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిపించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమావాస్య సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.



కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

విద్యార్థులకు ఆణిముత్యాలు ప్రోత్సాహకాల అందజేత



పాఠశాల టాపర్‌గా నిలిచిన లలిత్ సాయిని, అతని తల్లిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

దాబాగార్డెన్స్: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు అభినందన కార్యక్రమం జరిగింది. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో ఆణిముత్యాల పేరిట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే సత్కరించారు. పదో తరగతిలో నియోజకవర్గం పరిధిలో మొదటి మూడు ప్రైజ్‌లు ప్రకాశరావుపేట జీవీఎంసీ పాఠశాలకే దక్కడం అభినందనీయమంటూ పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. 586 మార్కులు సాధించిన లలిత్‌సాయికి రూ.15 వేలు, 564 మార్కులు సాధించిన దుర్గాకుమారి గుప్తాకు రూ.10 వేలు, 558 మార్కులు సాధించిన కె. నీరజకి రూ.5 వేలు జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలు, ముఖ్యమంత్రి ఫొటోతో కూడిన మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటో అందజేశారు. అలాగే విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రూప్‌కి ఒకరికి చొప్పున మొదటి బహుమతి వచ్చిన విద్యార్థిని (సీఈసీలో 957 మార్కులు) ఆర్. వినీతకి రూ.15 వేలు, ఎంపీసీలో 936 మార్కులు సాధించిన రోహిణికి రూ.15 వేలు, బైపీసీలో 932 మార్కులు సాధించిన యు. హరిణి, హెచ్‌ఈసీలో 784 మార్కులు సాధించిన సీహెచ్ స్రవంతికి రూ.15 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో మెరిట్ విద్యార్థినులకు తన సొంత కళాశాల రామబాణం, వైజాగ్ డిఫెన్స్ అకాడమీలో లక్షల విలువ చేసే విద్యను ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీతల వాసు, నీలాపు లక్ష్మి, బేవర మహేష్, కోరాడ సురేష్, అడపా శివ, నీలాపు శ్రీనివాసరావు, ఆరుగుల రాజు, డీఐవో స్వర్ణలత, ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రాధ, జీవీఎంసీ ప్రకాశరావుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుకల పంపిణీ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ హైస్కూల్, కేఎస్ఎం గర్ల్స్ హైస్కూళ్లలో శుక్రవారం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, హెచ్‌ఎంలతో కలిసి విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థుల చదువును తన భుజాన వేసుకుని వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు, మూడు జతల యూనిఫారాలు, కుట్టుకూలితో సహా ఒక జత షూస్, రెండు జతల సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగ్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లు స్కూల్ తెరిచిన తొలి రోజు నుంచే అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బులుసు జగదీష్, ఎస్.ప్రసాదరావు, నూకరాజు, రమణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, గోపి, ప్రకాష్, కనకమహాలక్ష్మి, స్వర్ణ, కృష్ణవేణి, రియాజ్, సచివాలయ సిబ్బంది, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కేఎస్ఎం హైస్కూల్లో బాలికలకు జేవీకే కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ లీలావతి

చికిత్సతో వంకర పాదాలు నయం

మహారాణిపేట : పుట్టుకతోనే వంకర పాదాలతో ఉన్న పిల్లలకు సరైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌లో క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వంకర పాదాల చికిత్సపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పాదాలు వంకరగా ఉన్నాయని భయపడొద్దని తెలిపారు. పలు చికిత్సా విధానాల ద్వారా పాదాలను పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ వంకర పాదాలపై వైద్యులకు కూడా అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, రాణిచంద్రమతి దేవి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బి.చక్రవర్తి, డాక్టర్ రుద్ర ప్రసాద్, డాక్టర్ అభిషేక్ తదితరులు కార్యక్రమానికి శిక్షకులుగా వ్యవహరించారు. క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు రీజనల్ మేనేజర్ పి.రవికుమార్, స్టేట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బి.శిరీషరాణి, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జి.జోత్స్న, డాక్టర్ వి.వి. సమత, పి.ప్రియాంక, బి.సాయి కిరణ్, ఇ.శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు. అవసరం అయిన వారు (8800020503) నంబర్‌కు కాల్ చేస్తే చికిత్స అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు.



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద

మూడేళ్లు దాటిన పిల్లలు అంగన్‌వాడీల్లో ఉండాలి

అల్లిపురం: మూడు పుట్టిన రోజులు జరుపుకున్న పిల్లలు అంగన్‌వాడీల్లోనే ఉండాలని కార్యకర్తలు నినదించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మవారివీధి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్యాబోధన చేస్తుందని, వారికి పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. మంచి అలవాట్లు, శాస్త్రీయ పరిజ్ఞానం తదితర అంశాలపై అవగాహన కలిగిస్తూ విద్యాబోధన సాగుతుందన్నారు. ఐసీడీఎస్ ఇచ్చిన ప్రీస్కూల్ మెటీరియల్‌తో చిన్నారులు విద్యను సులువుగా అభ్యసిస్తున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసే హ్యాండ్ మెటీరియల్ బోధనలో చక్కగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో 33వ వార్డు ఎంఎస్‌కే నూర్జహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణప్రియ, రాణిపుష్పవల్లి, భారతి, ఆయా కొండమ్మ, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సీతంపేట: ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి శుక్రవారం ఉదయం ఆయన సీతంపేట హరిజన వీధి, కనకమ్మ వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నివాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్, పారిశుధ్యం, రేషన్ కార్డుల మంజూరు సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ తెలియపర్చారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ అడ్మిన్ రాజశేఖర్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



25వ వార్డులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్